
ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
1 ఏప్రిల్
2025




# యాదగిరిగుట్ట టెంపుల్ సిటీలో 'వేద పాఠశాల'

**వేద పాఠశాల నిర్మాణానికి 23.79 కోట్లు కేటాయించిన ప్రభుత్వం**
**వైటీడీఏ నుండి 15 ఎకరాలు టెంపుల్ కు బదిలీ చేసిన ప్రభుత్వం**
**వేద పాఠశాల సమీపంలోనే సంస్కృత విద్యాపీఠం...?!**
**ఈవో భాస్కర్ రావు చొరవతో ఎమ్మెల్యే బీర్ల సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించిన వైనం**


యాదగిరిగుట్టలో వైటిడిఏ ఆధ్వర్యంలో ఏర్పాటయిన టెంపుల్ సిటీ లే అవుట్...


వై టి డి ఏ నుంచి 15 ఎకరాలను యాదగిరిగుట్ట ఆలయానికి బదిలీ చేస్తూ జారీ చేసిన లేఖను యువ భాస్కరరావుకు అందిస్తున్న వైటిడిఏ అధికారి

**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్టలో వేద విద్యను అభ్యసించడం కోసం వేద పాఠశాల ఏర్పాటు కానుంది. ఇందుకోసం ప్రభుత్వం సన్నాహాలు షురూ చేసింది. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అత్యాధునిక హంగులతో వేద పాఠశాల నిర్మాణానికి అడుగు ముందుకు పడింది. వేద పాఠశాలకు అడ్డంకిగా మారిన ల్యాండ్ సమస్యను పరిష్కరించిన ప్రభుత్వం.. యాదగిరిగుట్టలో వేద పాఠశాల నిర్మాణం కోసం ప్రభుత్వం 15 ఎకరాల భూమిని కేటాయించింది. అదేవిధంగా రూ.23.79 కోట్ల బడ్జెట్ కేటాయిస్తూ జీవో నంబర్ 124 ను సైతం జారీ చేసింది. మొత్తం బడ్జెట్ లో సీజీఎఫ్(క్రెడిట్ గ్యారంటీ ఫండ్) స్కీమ్ కింద ప్రభుత్వం రూ.13.79 కోట్లు మంజూరు చేయగా.. వైటీడీఏ రూ.5 కోట్లు, యాదగిరిగుట్ట దేవస్థానం రూ.5 కోట్లు ఇవ్వనుంది. ప్రభుత్వం టెండర్ ప్రక్రియ పూర్తి చేయగానే వేద పాఠశాల నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి.

### టెంపుల్ సిటీలో వేద పాఠశాల

యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిలో భాగంగా దేవస్థానానికి పశ్చిమ దిశలో ఉన్న పెద్దగుట్టపైన భక్తుల వసతి కోసం కాటేజీల నిర్మాణానికి ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం టెంపుల్ సిటీ ఏర్పాటు చేసింది. మొదటి విడతలో భాగంగా 250 ఎకరాలలో హెలీప్యాడ్ తో సహా విశాలమైన రోడ్లు, మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్, అండర్ డ్రైనేజీ, ఎలక్ట్రిసిటీ, గ్రీనరీ, ఎవెన్యూ ప్లాంటేషన్ తో సర్వహంగులతో టెంపుల్ సిటీగా అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా రాయగిరిలో వేద పాఠశాల ఏర్పాటు చేయాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. కాగా యాదగిరిగుట్టలోనే వేద పాఠశాల నిర్మిస్తే వేద విద్య అభ్యసించడానికి విద్యార్థులకు అనుకూలంగా ఉండడమే కాకుండా ఆధ్యాత్మికత భావన పెంపొందించడానికి ఆస్కారం ఏర్పడుతుందని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వేద పాఠశాలను యాదగిరిగుట్టలో ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రభుత్వం టెంపుల్ సిటీలో హెలీప్యాడ్ సమీపంలో 15 ఎకరాల భూమిని కేటాయించింది. కానీ అట్టి భూమి ఆలయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వైటీడీఏ(యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ) పరిధిలో ఉండడంతో.. ల్యాండ్ బదిలీకి అడ్డంకిగా మారింది. ఇదే విషయాన్ని ఆలయ ఈవో భాస్కర్ రావు స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకుపోగా.. ఆయన సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి సమస్య పరిష్కరించారు. వేద పాఠశాల కోసం టెంపుల్ సిటీలో 15 ఎకరాల స్థలాన్ని ఆలయానికి అప్పగించాల్సిందిగా వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో టెంపుల్ సిటీలో రెవెన్యూ అధికారులతో సర్వే చేపించిన వైటీడీఏ 15 ఎకరాలకు సంబంధించిన సర్వే రిపోర్టును ఆలయ ఈవోకు సమర్పించగా.. అట్టి రిపోర్టును ప్రభుత్వానికి ఈవో సమర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశంతో 15 ఎకరాల స్థలాన్ని ఆలయానికి వైటీడీఏ అప్పగించింది. 15 ఎకరాలకు సంబంధించి బౌండరీలు ఏర్పాటు చేసి లొకేషన్ స్కెచ్ కాపీని వైటీడీఏ అధికారులు ఆలయ ఈవోకు సమర్పించారు. దీంతో వేద పాఠశాల ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే వేద పాఠశాల పనులు షురూ కానున్నాయి.

### వేద పాఠశాల ప్రాంగణంలో సంస్కృత పాఠశాల.?

యాదగిరిగుట్టలో వేద పాఠశాల ఏర్పాటుకు సంబంధించిన అడ్డంకులు తొలగిపోవడంతో.. త్వరలోనే పనులు మొదలై సరిగ్గా ఏడాదిలోపు వేద పాఠశాల అందుబాటులోకి రానుంది. అదే సమయంలో దేవస్థానం ఆధ్వర్యంలో కొండ కింద నిర్వహింపబడుతున్న సంస్కృత పాఠశాలను కూడా వేద పాఠశాల ప్రదేశానికి తరలించడానికి ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వేద పాఠశాల, సంస్కృత పాఠశాల ఒకేచోట ఉంటే విద్యను అభ్యసించడానికి విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని ఆలయ అధికారులు భావిస్తున్నారు. అంతేకాకుండా వేద విద్య, సంస్కృత విద్యను ఏకకాలంలో నేర్చుకోవాలనుకునే విద్యార్థులకు మరింత అనుకూలంగా ఉండటమే కాకుండా, విద్యార్థులకు ప్రయాణపరమైన ఇబ్బందులు తప్పుతాయని భావిస్తున్నారు. ఇందుకోసం ఆలయ ఈవో భాస్కర్ రావు ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు కూడా పంపినట్లు తెలిసింది. దేవస్థానం ప్రతిపాదనకు ప్రభుత్వం గనుక అంగీకరిస్తే.. వేద పాఠశాల, సంస్కృత పాఠశాల ఒకేచోట ఏర్పాటై విద్యను అభ్యసించడానికి విద్యార్థులకు మార్గం సుగమం కానుంది.

### ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వేద పాఠశాల



అత్యాధునిక హంగులతో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వేద పాఠశాల నిర్మిస్తాం. ఇందు కోసం టెంపుల్ సిటీలో ప్రభుత్వం 15 ఎకరాలు కేటాయించింది. వేద పాఠశాల నిర్మాణానికి రూ.23.79 కోట్ల వ్యయం అవుతుండగా.. సీజీఎఫ్ స్కీమ్ కింద ప్రభుత్వం రూ.13.79 కోట్లు కేటాయించగా, వైటీడీఏ రూ.5 కోట్లు, దేవస్థానం మరో రూ.5 కోట్లు ఇవ్వనుంది. టెండర్ల ప్రక్రియ కంప్లీట్ కాగానే పనులు ఆరంభించి, ఏడాదిలోపు పూర్తి చేసి వేద పాఠశాలను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తాం.

**- ఈవో భాస్కర్ రావు, యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం.**

# యాదగిరికొండ నిండా భక్తులే...!!

**వరుస సెలవులతో నర్సన్న సన్నిధికి తరలొచ్చిన భక్తులు**
**కిక్కిరిసిన భక్తులతో కిటకిటలాడిన యాదగిరిగుట్ట**
**ధర్మదర్శనానికి 4,స్పెషల్ దర్శనానికి 2 గంటల సమయం**
**మండే ఒక్కరోజే ఆలయ ఖజానాకు రూ.66.44 లక్షల ఆదాయం**


కొండపైన వాహనాలతో నిండిపోయిన బస్ బే ప్రాంగణం


భక్తులతో కిటకిటలాడుతున్న ప్రధానాలయ ప్రాంగణం.

**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న యాదగిరికొండ సోమవారం భక్తులతో నిండిపోయింది. ఉగాది, రంజాన్ సందర్భంగా వరుస సెలవులు రావడంతో.. రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో కొండపైన, కిందా ఎక్కడ చూసినా భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడుతూ కనిపించాయి. రద్దీ కారణంగా ధర్మదర్శన, స్పెషల్ దర్శన క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కారణంగా నారసింహుడి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. స్వామివారి ధర్మదర్శనానికి ఐదు గంటలు, స్పెషల్ దర్శనానికి రెండు గంటలకు పైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. రద్దీ కారణంగా కొండ కింద లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, సత్యనారాయణస్వామి వ్రత మండపాలు.. కొండపైన బస్ బే, ప్రొటోకాల్ ఏరియా, దర్శన, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణం భక్తులతో కోలాహలంగా మారాయి. మరోవైపు ఆలయంలో నిర్వహించిన నిత్య పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. నారసింహుడి నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, సువర్ణపుష్పార్చన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు.

### నిండిపోయిన పార్కింగ్ ప్లేస్.. వాహనాల నిలిపివేత

యాదగిరి నారసింహుడి దర్శనం కోసం భక్తులు తమ సొంత వాహనాల్లో పెద్ద సంఖ్యలో తరలొచ్చారు. దీంతో కొండపైన వాహనాల పార్కింగ్ ప్లేస్ నిండిపోయింది. కొండపైన ఉన్న బస్ బే ప్రాంగణం, ప్రొటోకాల్ ఆఫీస్ పక్కన ఉన్న పార్కింగ్ ప్లేస్ వాహనాలతో ప్యాక్ కావడంతో.. ఆలయ అధికారులు కొండపైకి భక్తుల వాహనాలు రాకుండా కిందే నిలిపివేశారు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తప్పని పరిస్థితుల్లో భక్తులు తమ వాహనాలను కొండ కిందే పార్కింగ్ చేసి ఆర్టీసీ బస్సుల్లో కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. కొండపైకి వాహనాల నిలిపివేతతో బస్సుల్లో కొండపైకి వెళ్లే భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో.. బస్సులు సరిపోక భక్తులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. పరిస్థితి అదుపులోకి వచ్చాక తిరిగి కొండపైకి భక్తుల వాహనాలను అనుమతించారు.

### మండే ఒక్కరోజే రూ.66.44 లక్షల ఆదాయం

యాదగిరిగుట్ట క్షేత్రానికి అధిక సంఖ్యలో తరలివచ్చి జరిపించిన పలు రకాల పూజలతో ఆలయ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. భక్తులు నిర్వహించిన పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా సోమవారం ఆలయానికి రూ.66,44,697 ఆదాయం వచ్చింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.18,45,410, వీఐపీ దర్శనాలతో రూ.11.25 లక్షలు, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.8,52,500, బ్రేక్ దర్శనాల ద్వారా రూ.4,63,800, ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,83,350, సత్యనారాయణస్వామి వ్రతాల ద్వారా రూ.2,65,600 ఇన్ కమ్ వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

కాగా రద్దీ కారణంగా స్వామివారిని తొందరగా దర్శించుకోవడానికి భక్తులు స్పెషల్, బ్రేక్ దర్శనానికి ఎక్కువగా మొగ్గు చూపారు. రూ.150 వీఐపీ టికెట్ల ద్వారా 7500 మంది భక్తులు.. బ్రేక్ దర్శనాల ద్వారా 1546 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు. ఇక 2400 మంది భక్తులు స్వామివారికి తమ తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



క్యూ లైన్ లలో భక్తుల సందోహం... క్యూ లైన్లలో భక్తుల కోలాహలం

